# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 26 ఏప్రిల్, 2026 | పేజీలు :08


## రోడ్డుపై ధాన్యం ఆరబెట్టొద్దు..

### సిఐ వెంకటేష్



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** గంబీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల రైతన్నలు వరిధాన్యం రోడ్డుపై ఆరబెట్టి ప్రమాదాలకు కారకులు కావద్దని ఎల్లారెడ్డిపేట వలయాధికారి ఓ.వెంకటేష్ శనివారం విలేకరుల ప్రకటన చేశారు. రాత్రి సమయాలలో వరిధాన్యం ఆరబెట్టిన విషయం గ్రహించలేక పోవడంతో పలువురు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఎవరైన ఉల్లంఘించి ఆరబెట్టినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల పరిశీలన



**ప్రజాపక్షం/కథలాపూర్:** మండలంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణ పనులను వేములవాడ శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కలికోట సూరమ్మ ప్రాజెక్టు నుంచి ఎడమ మరియు కుడి కాలువల పనుల పురోగతి గురించి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్సి, డి ఈ, ఈ ఈ, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు,ప్రజలు మరియు రైతులు సమక్షంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రతి పది రోజులకు ఒకసారి కలికోట సూరమ్మ ప్రాజెక్టు యొక్క జరుగుతున్న పురోగతి పనులకు సంబంధించి ఈ సీజన్ కు అందించవలసిన లక్ష్యంతో పని చేసే క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో సాగునీటి శాఖ మాత్యులు ఉత్తమ కుమార్ రెడ్డి ప్రాజెక్టు మత్తడి పూర్తయిన సందర్భంగా సందర్శించినప్పుడు ప్రాధాన్యత ప్రాజెక్టుల విభాగంలో సూరమ్మ ప్రాజెక్టును పెట్టడం జరిగిందని అన్నారు. ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని తద్వారా ఈ ప్రాంత ప్రజలకు వరప్రధాయని కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాల ప్రజలకు రైతులకు మారుతుందని అన్నారు. సూరమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువ సుమారు 14 కిలోమీటర్లు కుడికాలువ 18 నుండి 19 కిలోమీటర్ల వరకు పూర్తి చేయాలని లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటివరకు 45 కోట్ల 50 లక్షల రూపాయలు భూ నిర్వాసితులకు అందించడం జరిగిందని తెలిపారు.సూరమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువకు సంబంధించి కలికోట నుండి చింతకుంట గ్రామం వరకు ఉన్న అన్ని గ్రామాల దాదాపు 14 కిలోమీటర్ల కాలువకు సంబంధించిన భూ సేకరణ పూర్తయిందని అధికారులు తెలిపారని అన్నారు. అదేవిధంగా కుడికాలువకు 19 కిలోమీటర్ల కు సంబంధించిన భూనిర్వాసితులకు ఇప్పటి వరకు రెండు గ్రామాల రైతులకు నష్టపరిహారం అందించడం జరిగిందని తెలిపారు.ఈరోజు జరిగిన సమీక్ష సమావేశంలో సూరమ్మ ప్రాజెక్టుకు సంబంధించిన కాంట్రాక్టర్ ను సంప్రదించి అధికారులు ఎడమ కాలువ పనులు వెంటనే ప్రారంభించాలని తెలపడం జరిగిందని అన్నారు. కాంట్రాక్టర్ బదులుగా మరో వారం పది రోజులలో ప్రారంభిస్తామని తెలిపారు.ఈ ప్రాజెక్టు నిర్మాణం తో ఈ ప్రాంత రైతుల ఆకాంక్ష నెరవేరుతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎడమ, కుడి కాలువలు పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి త్రాగునీరు అవసరాలు కూడా తీరుతాయని అన్నారు. సూరమ్మ ప్రాజెక్టుకు ముందు సూరమ్మ ప్రాజెక్టు తర్వాత ఈ ప్రాంత రైతుల జీవితాల్లో మార్పు రాబోతుందని అన్నారు. సూరమ్మ ప్రాజెక్టు కుడి మరియు ఎడమ కాలు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు మరియు రైతులకు వ్యవసాయానికి అవసరమైన నీటి సదుపాయాలు పూర్తిగా అందుబాటులో ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ జివాకర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో శంకర్, కలికోట స్థానిక సర్పంచ్ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో వడ్ల కొనుగోలు కేంద్రం
# పరిశీలించిన కెటిఆర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రంలో రైతులకు రైతు బంధు లేదు, సరిపడా విద్యుత్ సరఫరా లేదు, సమయానికి వడ్లు కొనుగోలు చేయడం లేదని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పరిస్థితి దారుణంగా మారిందని మండిపడ్డారు. వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి, వడ్లు కొనుగోలు అయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. నెల రోజులుగా రైతులు వడ్లను కేంద్రాలకు తీసుకువస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనలేదని అన్నారు. వడ్లు కొంటే మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 1000 టన్నుల వడ్లు కూడా కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ యజమానులకు ఇచ్చినట్లే కౌలు రైతులకు కూడా రైతు బంధు ఇస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ అమలు కాలేదని, రైతు కూలీలకు 1000 రూపాయలు ఇస్తామని చెప్పిన వాగ్దానం కూడా నెరవేర్చలేదని అన్నారు. వడ్ల కొనుగోళ్ల కోసం వెంటనే కాంటాలను ఏర్పాటు చేసి, రైస్ మిల్లులను కేటాయించాలని, 500 రూపాయల బోనస్‌తో కలిపి కనీస మద్దతు ధరను 2350 రూపాయలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి, వడ్లు కొనుగోలు అయ్యే వరకు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ 2026 క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ సిరిసిల్ల డాల్ఫిన్స్ కు కప్పు అందజేసి అభినందించారు.

## ఉపాధి హామీ కూలీలకు
# సౌకర్యాలు కల్పించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/గంగాధర:** ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ పని ప్రదేశంలో ఎండకాలంలో కనీస సౌకర్యాలైన త్రాగునీరు, మెడికల్ కిట్టు, టెంటు, పారా, గడ్డపార వంటి సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉపాధి కూలీలకు ఇస్తామన్న ఏడాదికి రూ.12 వేలు వెంటనే ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామంలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లను సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పంపిణీ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి విబి జీవంజి పేరుతో కొత్త బిల్లును తీసుకొచ్చిందన్నారు. పాత పద్ధతిలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలను రెండు పూటలు ఫోటో తీయాలని ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఉపాది కూలీలను ఆదుకునేందుకు ప్రభుత్వం 200 రోజులు పని కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సవరించిన వ్యవసాయ కార్మికుల వేతనాలను అమలు చేసి గ్రామ సభలు నిర్వహించి పెరిగిన కూలీ రేట్లను గ్రామాలలో ప్రచారం చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు రూ.7500 పించన్ ఇవ్వాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, మండల కార్యదర్శి రవీందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మచ్చ రమేష్, సిపిఐ పార్టీ మండల నాయకులు వేముల మల్లేశం, ఎలిగేటి సురేందర్ తదితరులున్నారు.



# రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్‌:** రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రెడ్డి ఉద్యమ జేఏసీ అధ్యక్షుడు బండ గోపాల్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రెడ్డి సామాజిక వర్గంలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలు రాయితీలు, రిజర్వేషన్లు అందించినప్పుడే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అభివృద్ధి కోసం అందించే నిధులను నేరుగా వారి ఖాతాలోనే జమ చేయాలన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి అందరినీ బాగస్వాములును చేయాలన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులు పండించిన పంటలు, కూరగాయాలకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. నేరుగా రైతులు అమ్ముకునే విధంగా మార్కెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రెడ్డి ఉద్యమ జేఏసీ వ్యవస్థాపకుడు జంగా చంద్రారెడ్డి, ఊట్ల బాపురెడ్డి, తదితరులున్నారు.



## ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కూలీ

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మహిళ కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ రూరల్ మండలంలోని చెర్లభూత్కూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన భార్య భర్తలు బ్రతుకు దెరువు కోసం గత మూడు నెలల క్రితం కరీంనగర్ రూరల్ మండలంలోని చెర్లభూత్కూరు గ్రామంలో ఉన్న ఇటుక బట్టీలోకి పనికి వచ్చారు. కూలీ పని చేస్తుండగా మహిళ గత కొన్ని రోజుల నుంచి మానసిక పరిస్థితి సరిగ్గా లేక అనారోగ్యంగా బాధపడుతూ పనికి వెళ్లకుండా బట్టీల వద్ద కు పనికి వెళ్లగా మహిళ(23) తన 9 నెలల పాపతో ఇంటి వద్ద ఉండి గదిలో ఇనుప పైపుకు చీరతో ఉరివేసుకుని వేలాడుతుండగా చుట్టుపక్కల వారు చూసి వచ్చి ఉరివేసుకున్న చీరను విడిపించి భర్తకు తెలిపి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మరణించిందని స్పష్టం చేశారు. ఒరిస్సాలో ఉన్న తన తల్లిదండ్రులకు సమాచారం అందించగా శనివారం తండ్రి తహసిల్ కేటాకీ కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన బిడ్డ గత కొద్ది రోజుల నుంచి మానసిక పరిస్థితి సరిగా లేదని అల్లుడు ఫోన్ ద్వారా తెలిపారని, శవపరీక్ష జరిపించి మృతదేహాన్ని అప్పగించాలని కోరారు. కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నరసింహరావు శవపంచనామా జరిపి శవాన్ని శవపరీక్షకు పంపించినట్లు సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు పడిదెల బుచ్చంరావు ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు.ఈ క్రమంలో ముత్తారం మండల మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో వారి నివాసానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్నెని బుచ్చంరావు, కే డి సి సి మాజీ డైరెక్టర్ రాంపల్లి గోపాల్ రావులకు బుచ్చంరావు మామ మృతి పట్ల మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి తమ అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు కోల విజయ్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి కొండాల్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోహన్ ఆసుపత్రిలో ఆడపిల్ల పుడితే ఉచిత ప్రసవం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్‌:** ప్రముఖ వైద్య సేవల సంస్థ రోహన్ హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్ 24 ఏళ్ల విజయవంతమైన సేవలను పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సంధర్బంగా ఆడపిల్లల సంరక్షణ, గౌరవాన్ని పెంపొందించే లక్ష్యంతో దేవీ పుత్రిక అనే వినూత్న సామాజిక పథకాన్ని శనివారం ఘనంగా ప్రారంబించింది. రోహన్ హాస్పిటల్‌లో విలేకరుల సమావేశంలో ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడింద్చరు. ఈ కార్యక్రమానికి అడిషనల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎ.నీరజ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దేవీ పుత్రిక లోగో, కరపత్రాన్ని ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా డాక్టర్ బిఎన్ రావు పాల్గొన్నారు. ఈ సంధర్బంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ ఎనమల్ల శ్రీదేవి, డాక్టర్ ఎనమల్ల నరేష్‌లు మాట్లాడుతూ ఏప్రిల్ 25 నుంచి వచ్చే ఏడాది జూన్ 16 వరకు రోహన్ హాస్పిటల్‌లో ఆడపిల్ల జన్మిస్తే అది సాధారణ ప్రసవం అయినా లేదా శస్త్ర చికిత్స ద్వారా అయినా పూర్తి వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లల పట్ల ఇంకా కొనసాగుతున్న వివక్షను తొలగించాలనే ఉద్దేశంతో బేటీ బచావో బేటీ పడావో స్పూర్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. న్యాయాదికారి ఎ.నీరజ మాట్లాడుతూ వ్యాపార వృద్ధి కోసం కాకుండా సామాజిక బాధ్యతతో ఆడపిల్ల పుడితే ఉచిత ప్రసవ సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, రోగులు, శ్రేయోభిలాషులు పాల్గొనగా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## డిటిఎఫ్ విద్యా సదస్సును విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీఎఫ్ శాఖలు సంయుక్తంగా ఈ నెల 28 మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహత్తర విద్యా సదస్సును విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు ఆవాల నరహరి ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, ప్రజాసంఘాల నాయకులను కోరారు. శనివారం జమ్మికుంట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో విద్యా రంగం అనేక మార్పులు, సవాళ్లను ఎదుర్కొంటోందని, ప్రభుత్వ విధానాలు, ప్రైవేటీకరణ ప్రభావం, నాణ్యమైన విద్య అందుబాటు వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చ అవసరమని తెలిపారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యా రంగం వర్తమానం, భవిష్యత్తు, సవాళ్లు" అనే ప్రధాన అంశంపై ఈ విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి హేమలత, డీటీఎఫ్ మండల అధ్యక్షులు బి.వేణుగోపాల్, హరీష్ కుమార్, అనూష, పద్మ, బలరాం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నదాతపై ప్రభుత్వానికి కక్ష ఎందుకు?



**ప్రజాపక్షం/గంగాధరః** గంగాధర మండలం గట్టుభూత్కూరు గ్రామంలో శనివారం స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు. తూతూ మంత్రంగా సాగుతోందని, కనీస వసతులు సైతం ఇక్కడ లేవని, పంటలు చేతికి వచ్చి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు వేసి రోజులు తరబడి వేచి చూస్తున్నా కాంటాలు సకాలంలో జరగడం లేదని రైతులు వాపోయారు. ఈ సంధర్బంగా సుంకె మాట్లాడుతూ అన్నదాతపై ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. పంటలకు సాగు నీరు ఇవ్వకుండా లక్షల ఎకరాలను ఎండబెట్టిన ప్రభుత్వం ఇప్పుడు రైతుల చేతికి వచ్చిన కొద్దిపాటి పంటలను సైతం కొనకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చొప్పదండి నియోజకవర్గం వ్యాప్తంగా 25 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల ప్రారంభాలతోనే సరి పెట్టారని, మిల్లర్లు అలాట్‌మెంట్ కాలేదని, కొనుగోళ్లు కరువు కాంటా వేసేది లేదని, వడ్లు కొనేది లేదంటున్నారని అన్నారు. సన్నాల కొనుగోళ్లు సున్నా అన్నారు. సకాలంలో ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల మిల్లర్లు, దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారని, మద్దతు ధర దేవుడెరుగు, ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క గింజ సైతం కొనుగోలు చేయలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ హయాంలో, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు నీరందించి భూమికి బరువయ్యే పంట పండించినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి గింజ కొనుగోలు చేసి వారం రోజుల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు చేపట్టాలని, తప్ప, తాలు పేరుతో కటింగ చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు కంకణాల విజయేందర్ రెడ్డి, వేముల దామోదర్ తదితరులున్నారు.

## బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

**ప్రజాపక్షం/చొప్పదండిః** ఈ నెల 27న బిఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవాలు చొప్పదండి బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో స్వరాష్ట్రం కోసం పుట్టిన జెండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన జెండా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ జెండా గులాబీ జెండానని పేర్కొన్నారు. బిఆర్ఎస్ జెండా గద్దెలు అందంగా ముస్తాబు చేసి ఆయా మండలాల అధ్యక్షులు ప్రతి గ్రామంలో గ్రామ అధ్యక్షులు బిఆర్ఎస్ జెండా ఎగురవేసి ఆవిర్బావ దినోత్స వేడుకలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## కవిత సభకు తరలి వెళ్లిన నాయకులు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కలవకుంట్ల కవిత ఆదేశాల మేరకు శనివారం హైదరాబాద్ మేడ్చల్ లో జరిగే పార్టీ ఆవిర్భావ సందర్భంగా జమ్మికుంట పట్టణం నుండి అంబాల హరీష్ ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలతో సభను విజయవంతం చేయడానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా అంబాల హరీష్ మాట్లాడుతూ, ప్రతి గ్రామం నుండి ప్రతి పట్టణం నుండి అధిక సంఖ్యలో వచ్చి ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల సురేష్, ఎర్ర వెంకటేష్, అంబాల సుదర్శన్, కిరణ్, శివ, రాజు, మమత సునీత తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో మే 6, 2026న జాబ్ మేళా

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ (యూత్ & స్పోర్ట్స్)" లో భాగంగా, మే 6, 2026న పెద్దపల్లి జిల్లాలో జాబ్ మేళా నిర్వహించబడుతుందనీ, ఈ మేళాలో మ్యానుఫాక్చరింగ్, ఐటీ, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, కస్టమర్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఉద్యోగావకాశాలు లభించనున్నాయనీ, రాష్ట్రవ్యాప్తంగా 250+ కంపెనీలు పాల్గొంటున్నాయని,ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన వారు (ఫ్రెషర్స్ & అనుభవం ఉన్న వారు) ఈ మేళాలో పాల్గొనవచ్చని, ఆసక్తి గల యువత ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి:https://deettask.wallero.com/candidate/register నమోదు చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ వివరాలు SMS/Email ద్వారా అందజేయబడతాయని ఉపాధి కల్పనాధికారి తెలిపారు.అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరడమైనది.

## వేములవాడలో ఘనంగా ఆర్టీసీ కార్మికుల సంబరాలు

**ప్రజాపక్షం/వేములవాడ:** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంతో వేములవాడ ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కార్మికులు కోరిన 32 డిమాండ్లలో 29 డిమాండ్లను పరిష్కరిస్తున్నట్లు ప్రకటించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో ఎదుట బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్న కార్మికులు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు మరియు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కార్మికులు క్షీరాభిషేకం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించడం సంతోషదాయకమని తమకు అండగా నిలిచిన ఆది శ్రీనివాస్‌కు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన ప్రజా ప్రభుత్వమని కొనియాడారు. విజయోత్సవ అనంతరం కార్మికులు తమ తోటి కార్మికుడు శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమ్మె కాలంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల గోడును విన్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇకపై విధుల్లో మరింత బాధ్యతగా పనిచేస్తామని కార్మికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డిపో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** శివపల్లి గ్రామంలో శాసనసభ్యులు పెద్దపల్లి నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి కీలక అంశాలపై తమ వినతి పత్రాన్ని అందజేశారు.ప్రస్తుతం విద్యా వ్యవస్థలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఉన్న పదోన్నతి అవకాశాల లోటును దృష్టిలో ఉంచుకొని, ఉప విద్యాధికారులు డైట్ లెక్చరర్లు, జూనియర్ కాలేజ్ లెక్చరర్లు, బిఈడి కాలేజీ లెక్చరర్లు, అలాగే సీట్,స్కీర్ట్ వంటి కీలక సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు తక్షణ పదోన్నతులు కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో సత్వర సంప్రదింపులు జరిపి సానుకూల ఉత్తర్వులు వెలువడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, ఇటీవల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో, ముందుగా బదిలీలు తదుపరి పదోన్నతులు అనే క్రమంలో సమగ్ర షెడ్యూల్ విడుదల చేయించేందుకు ముఖ్యమంత్రి ని ఒప్పించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ తరుపున మనవి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజభాను చంద్ర ప్రకాష్, డా.పర్వతి సత్యనారాయణ, వేణుగోపాల రావు,శ్రీనివాస్, ఎర్రోజు రఘునందన చారి పాల్గొని సంఘం అభిప్రాయాలను సమగ్రంగా వివరించారు.



# మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మలేరియా రహిత జిల్లాగా నిర్మించాలని, మలేరియా ను జయించడానికి ప్రతి ఒక్కరూ కలిసి కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ రజిత పిలుపు నిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవంను పురస్కరించుకొని మలేరియా అంతం చేద్దాం ఆరోగ్యమైన సమాజాన్ని రేపటికి నిర్మిద్దాం అనే నినాదంతో ముస్తాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవం అవగాహన కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ మలేరియా అంతం చేసే దిశగా పనిచేయాలన్నారు. మనం చేయగలం, తప్పక చెయ్యాలి అనే నినాదంతో మలేరియా దూరమవుతుందని అన్నారు. పరిసరాలలో నీటి నిల్వ ఉండకుండా చూడాలని, నీటి ట్యాంకులు, డబ్బాలు మూత లతో మూసి ఉంచాలని, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి నిల్వ తొట్టిలు కనీసం వారానికి ఒక్కసారి అయినా శుభ్రం చేసుకోవాలని, తద్వారా లార్వా వృద్ధి చెందదని, దోమ తెరలు వాడాలని, ఇంటి కిటికీలకు మెష్ డోర్లు బిగించాలని, దోమలు పెరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దోమ కాటు వల్ల వణుకు జ్వరం , తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులు అలసట లాంటి సమస్యలు ఉంటే వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలలో విధిగా మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించవలసిందిగా ఆశాలకు, ఏఎన్ఎంలకు సూచించినారు. ఈ కార్యక్రమంలో పోద్దల్ సర్పంచ్ యాదమ్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ నహిమా, డాక్టర్ ఆఫీ జ, డాక్టర్ గీతాంజలి, రాజ్ కుమార్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావు పల్లి గ్రామంలో గల బుడగజంగం కాలనీలో పస్తం ఎల్లయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబానికి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నారాయణరావుపల్లి గ్రామ సర్పంచ్ నామని రాజి రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పొన్నం మణికాంత్ వార్డు సభ్యులు గుర్రం రమేష్ తూర్పాటి శ్రావణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని మున్సిపల్ చైర్మన్ నువ్విలా మల్లయ్య అన్నారు. శనివారం రోజున పట్టణంలో పలు వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వార్డు కౌన్సిలర్ల తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో 4వ వార్డులో రైల్వే స్టేషన్ రోడ్డు హనుమాన్ నగర్ లో 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం,5 వార్డులో 18 లక్షల రూపాయలతో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహిళా పోలీస్ స్టేషన్ వచ్చేవారికి రేకుల షెడ్డు మరియు టాయిలెట్స్ నిర్మాణం అలాగే 10వ వార్డులోని క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం చేయడం జరుగుతుందని, ఈ అభివృద్ధి పనులకు సహకరిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లకు, మున్సిపల్ కమిషనర్ కు వారి సిబ్బందికి పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు కొమ్ము సుధాకర్,గుజ్జుల కుమార్,అక్కేపల్లి సుజాత క్రాంతి,పూదరి అనూష మహేందర్,మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్,వార్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్, సాగర్,వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుని కి ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోరాట సాధనలో భాగంగా తన ప్రాణాలను అర్పించిన కోల శంకర్ గౌడ్ కు పెద్దపల్లి జిల్లా ఉద్యగులందరూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రోజు సాయంత్రం 4.30 గంటలకు ఐ డి ఓ సి ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శంకర్ గౌడ్ కు శ్రద్ధాంజలి ఘటించినట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు బొంకూరు శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఉద్యోగ సంఘాల జే.ఏ.సీ. చైర్మన్ & పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమలో భాగమేనని, ఏ ఉద్యోగికి కష్టమచ్చినా ఉద్యోగ సంఘాల జే ఏ సీ బాసటగా నిలుస్తుందని, ఉద్యోగులు అటు ప్రభుత్వంలోనూ ఇటు ప్రజల్లోనూ మమేకమై పని చేస్తారని, ఉద్యోగులకు వచ్చే అన్ని రకాల భత్యాలు ఇలా సమ్మెల అవసరం లేకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తే ఉద్యోగులు ఇలా కుటుంబాలను ఒంటరి చేసే పరిస్థితులు రావని, ఉద్యోగులు ఇంకా స్ఫూర్తితో పనిచేస్తారని ప్రస్తుటించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ తూము రవీందర్, రంగారెడ్డి, కరుణాకర్, రవీంద్రనాథ్, రవీందర్, సాజిద్, రాజయ్య, రాజాప్రసాద్, అనిత శిల్ప, ఉమాదేవి, ఉమపద్మజ, సురేష్, శ్యామ్, రాజమహేందర్, ప్రకాష్, రవి, అఖిల్, నిఖిల్, రాము పాల్గొన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక భారతీయ జనతా పార్టీ విజయమే కాదు.. ఇది నగర ప్రజల విజయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఐదుగురు కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో బిజెపితో పాటు ముగ్గురు బిఆర్ఎస్ సభ్యులు సైతం మద్దతు తెలుపుతూ చేయి ఎత్తి బలపరచడంతో ఐదు స్థానాలను బిజెపి కైవసం చేసుకుంది. ఎన్నికల్లో విజయం సాధించి కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన కన్న కృష్ణ, చిగిరి వెంకటమ్మ, ఎలగందుల నందకుమార్, మైనారిటీ కోటాల బల్బీర్ సింగ్, ఆఫీజా బేగంలు మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ సమక్షంలో డిప్యూటీ కమిషనర్ వేణు గెలుపు పత్రాలను అందించారు. గెలిచిన అభ్యర్థులకు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. బిజెపికి చెందిన 34 మంది పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా బిఆర్ఎస్‌కు చెందిన మరో ముగ్గురు సభ్యులు మద్దతు ప్రకటించి ఎన్నుకోగా ఐదుగురు అభ్యర్థులలో కన్న కృష్ణ, చిగిరి వెంకటమ్మ, బల్బీర్ సింగ్ 36 ఓట్ల చొప్పున రాగా ఎలగందుల నందకుమార్, ఆఫీజా బేగంకు 37 ఓట్లు వచ్చాయి. కో ఆప్షన్ ఎన్నికలలో పోటీ చేయుటకు సమర్పించిన ధరఖాస్తులలో ఆమోదించబడి మొత్తం 40 మంది సభ్యులు పోటీల్లో పాల్గొనగా 6 ధరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో కో ఆప్షన్ సభ్యుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వంలో కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మొహియుద్దీన్, మున్సిపల్ అధికారులున్నారు.

# అన్నదాతకు ప్రజా ప్రభుత్వం అండ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అన్నదాతకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, కాంగ్రెస్ రైతు పక్షపాతి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం రోజునపెద్దపల్లి మండలం రాఘవాపూర్ మరియు అప్పన్నపేట గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో, రైతులతో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలకులు కోతల పేరిట రైతుల శ్రమను దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు అండగా ఉంటూ రైతులకు కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటూ రైతుల మన్నలు పోతుందని స్పష్టం చేశారు. రైతుల ప్రభుత్వం సూచించిన విధంగా ధాన్యానికి 15 శాతం తేమ వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చెర్మన్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు,పలు గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మాజీ ప్రజా ప్రతినిధులు, రైతు,తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణపై ఉద్యోగులకు అవగాహన

**ప్రజాపక్షం/రామగిరి:** ఆర్జీ3 ఏరియాలోని ఓసిపి2 ఉపరితల గని నందు శనివారం వైద్యఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ,వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల పై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ వేసవికాలంలో ఉద్యోగులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ఆహారపు అలవాట్ల లో మార్పు రావాలన్నారు. మాంసాహారం, మద్యపానం, ధూమపానం జోలికి వెళ్లకపోవడం మంచిదని వారు అన్నారు. అంతేకాకుండా ఆరోగ్యం కోసం పలు సలహాలు,సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇంచార్జ్ మేనేజర్ సంపత్ కుమార్, పిట్ సెక్రెటరీలు సురేష్, రామిండ్ల మనోహర్, భద్రత అధికారి ఆసీఫ్ యాసిన్, సంక్షేమ అధికారులు ప్రీతి, కళ్యాణ్ తోపాటు ఇతర అధికారులు,ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/చందుర్తి:** వరి ధాన్యం తూకం ప్రారంభించి కొనుగోలు వేగవంతం చేయాలని బిజెపి కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు చింతకుంట సాగర్ శనివారం అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారం రోజులు గడుస్తున్న తూకం మాత్రం ప్రారంభం కాలేదని అన్నారు.అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారని , ప్రభుత్వం స్పందించి తొందరగా మిల్లులు కేటాయించి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

# అధికార మదంతో మాపై అసత్యపు ప్రచారాలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మార్కెట్ కమిటీ చైర్మన్ అధికార మదంతో మాపై అసత్యపు ప్రచారాలు చేస్తుందని సిరిసిల్ల పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కల చక్రపాణి మండిపడ్డారు. శనివారం తెలంగాణ భవన్ లో సమావేశం నిర్వహించి ఏఎంసీ చైర్మన్ శుక్రవారం ప్రెస్ మీట్ లో మాట్లాడిన మాటలను ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిన్నటి రోజు ఏఎంసి చైర్మన్ తప్పులను సమర్థించుకుంటూ అబద్దపు మాటలతో మమల్ని నిందిస్తున్నారన్నారు. మెప్మా ద్వారా నిర్వహించే కార్యక్రమాలలో మున్సిపల్ చైర్ పర్సన్ ముందు పాల్గొనేలా ప్రోటోకాల్ ఉందనీ, ఏఎంసి చైర్మన్ కేవలం గౌరవంగా పిలిస్తే రావాలి కానీ మాపై జులుం చెలాయిస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వరి ధాన్యం కొనుగోలులో దాన్యం అంటే అన్నపూర్ణతల్లి అని ఆ తల్లి సాక్షిగా చెబుతున్నామనీ అనవసరంగా మేము గాని నా భర్త గాని ఒక్క మాట కూడా చెడు మాట మాట్లాడలేదని ఎక్కడైనా నిరూపించ ర‌గం అన్నారు. ఏఎంసి చైర్మన్ అనవసరంగా ఏమి మాటలు అనలేదని నిరూపించగలిగితే దమ్ముందా అని సవాలు విసిరారు. అనవసరంగా ఆవేశానికి లోనై ఏఎంసీ చైర్మన్ నువ్వెందుకు అంటున్నావు నీ పళ్ళు రాలగొడతానని నాపై దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. శుక్రవారం సమావేశంలో అబద్దపు మాటలు చెబుతుందని, మా దగ్గర ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మకపేట, ఎర్దండి, మూలరాంపూర్ గ్రామాల్లో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఏలాల వెంకటరెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు గంగాధర్, కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ పరిపాలన అధికారులు, విం డో కార్యదర్శి మంత్రి సతీష్, రైతులు, పాల్గొన్నారు.

## వెల్లుల్ల గ్రామంలో జనాభా గణన సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం



ప్రజాపక్షం /మెట్పల్లి : మెట్పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భారతదేశ జనాభా గణన–2027కు సంబంధించిన ఇండ్ల జాబితా తయారీ మరియు ఇండ్ల గణన (హెచ్ఎల్ఓ–2026) సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లు నర్సింహాచారి, రాజేందర్ ఫీల్డ్ విజిట్ నిర్వహిస్తూ ప్రత్యక్షంగా శిక్షణ అందించారు. గృహాల వివరాల సేకరణ,నమోదు విధానం,గణన ప్రక్రియలో పాటించాల్సిన నియమాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, ఏపిఓ గంగారెడ్డి, ఆర్ఐ కాంతయ్య, జీపీవో నాగరాణి, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆజాద్ రాణా ప్రతాప్ బస్తి హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/మెట్పల్లి : ఈ నెల 28వ తేదీన ఆజాద్ రాణా ప్రతాప్ బస్తిలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ అమరేశ్వర్, డాక్టర్ గంగాసాగర్ మరియు ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణ కోసం ఇటువంటి సమ్మేళనాలు అవసరమని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యతా భావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక హిందూ సంఘాల ప్రతినిధులు, యువకులు, బస్తి పెద్దలు మరియు పలువురు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

### ధర్మపురి ఏఎంసి చైర్ పర్సన్ లావణ్య



ప్రజాపక్షం/ధర్మపురి : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, రైతులు పండించిన ప్రతీ వరి గింజను ప్రభుత్వం తగిన మద్దతు ధర అందిస్తూ ధాన్యం సేకరణ జరుపుతోందని ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ తెలిపారు.జగిత్యాల జిల్లా ధర్మపురి మార్కెట్ యార్డులో శనివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి తో కలిసి ఏఎంసి చైర్ పర్సన్ లావణ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని అన్నారు.రైతు పండించిన వరిధాన్యాన్ని కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోళ్లు చేస్తున్నదని పేర్కొన్నారు. ధాన్యంతో వచ్చే రైతులకు మార్కెట్ యార్డులో అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.దళారుల మాయమాటలకు లొంగకుండా కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలని తద్వారా ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర ఏ గ్రేడ్ వడ్లకు రూ.2389,బి గ్రేడ్ కు రూ.2369 పొందాల్సిందిగా లావణ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, డైరెక్టర్లు ఎండీ రఫియోద్దీన్, ఎన్నం మధుకర్ రెడ్డి, నాగారం సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, సెంటర్ ఇంచార్జి, రైతులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/కొడిమ్యాల : కొడిమ్యాల మండలంలోని గంగారామ్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వినోద్ నాయక్ అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా మహిళా సాధికారిక మరియు సఖి సిబ్బంది గ్రామ ప్రజలకు, గ్రామ పెద్దలకి బాల్య వివాహంపై అవగాహన కల్పించడం జరిగింది.బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయికి 21 సంవత్సరం లోపు అబ్బాయికి వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష మరియు లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడనని అదేవిధంగా బాల్యవివాహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుందని అలాగే ప్రభుత్వం నుంచి ఇచ్చే ప్రోత్సాహాలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు వర్తించవని,అలాగే 18 సంవత్సరాల లోపు బాలబాలికలకి రక్షణ,సంరక్షణ అవసరమైన పిల్లల కొరకు 24 గంటలు పనిచేసే ఉచిత అత్యవసర ఫోన్ సేవా సౌకర్యం చైల్డ్ హెల్ప్ లైన్1098 పోలీస్ 100, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం 112, మహిళల కోసం 181 సౌకర్యాన్ని అవసరం ఉన్నపుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.బాల్య వివాహాలు లేని భారతదేశ కోసం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత సిబ్బంది,గ్రామ సర్పంచ్ మరియు,వార్డ్ మెంబర్స్, పంచాయతీ కార్యదర్శి,అంగన్వాడి టీచర్స్ గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు,

## జనగణన స్వీయ నమోదుపై అవగాహన సమావేశం



ప్రజాపక్షం/కొడిమ్యాల : కొడిమ్యాల మండల కేంద్రం తహసీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో ఎం.పి.డి.ఓ. స్వరూప సామాన్వయంతో జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ నమోదు (Self Enumeration) విధానంపై విస్తృత అవగాహన కల్పించేందుకు,కోడిమ్యాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్లతో అవగాహన సమావేశం నిర్వహించబడినది. స మావేశంలో స్వీయ నమోదు ప్రక్రియ యొక్క విధానం, ప్రాముఖ్యత మరి యు ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించబడినవి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు తమ వివరాలను స్వయంగా మొబైల్ ఫోన్ ద్వారా నమోదు చేసుకునే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.స్వీయ నమో దు కార్యక్రమం 26.04.2026 నుండి 10.05.2026 వరకు https://se.census.gov.in వెబ్సైట్లో అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. కావున, కోడిమ్యాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు,సిబ్బంది మరియు ప్రజలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, ప్రతి కుటుంబం స్వీయ నమోదు చేసుకునేలా సహకరించవలసిందిగా ఎం.ఆర్.ఓ నరేష్ కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రణాళిక, గణాంక అధికారి (MPSO), అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్లు,వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో శ నివారం గ్రామపంచాయతీ అవరణం లోని కళ వేదిక లో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ జరిగింది.హిందూ సమ్మేలనం కు ఎప్రిల్ 29 బుధవారం న అభయ హిందూ సేన ఫౌ ండర్ భగవద్గీత ప్రచారకులు శ్రీశ్రీశ్రీ రాధా మనోహర్ దాస్ ,ముఖ్య వక్త మచ్చ జ్యోత్స్న శశిధర్,ప్రధాన వక్త జిన్న సత్యనారాయణ రెడ్డి లు హిందూ సమ్మేళనం కు హజరవుతారని,సమ్మేలనంలో సామూహిక హనుమా న్ చాలీసా పారాయణం, ధర్మ ప్రబోధిత సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామీజీ, వక్తల ప్రసంగాలతో హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు.సమ్మేలనంకు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల హనుమాన్, అయ్యప్ప, శివ తదితర దీక్షాపరులు,యువజన సంఘాలు, భజన బృందాలు,హిందూ సంఘాలు కుటుంబ సభ్యులతో పాల్గొనాలని కమిటీ పిలుపునిచ్చారు.

## మెట్పల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ప్రజాపక్షం/మెట్పల్లి : మెట్పల్లి మండలంలోని మెట్ల చిట్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో విట్టంపేట్, రంగారావుపేట్, రామలచ్చక్కపేట్, ఆత్మకూర్, జగ్గాసాగర్, బండలింగాపూర్, రాజేశ్వరరావుపేట్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, డీసీఓ మనోజ్ కుమార్, పిఏసీ నిజాముద్దీన్తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూన గోవర్ధన్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని సరిగా ఆరబెట్టుకుని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉమేష్, ఏఎ ంసీ డైరెక్టర్లు మనాల లింగారెడ్డి,పుప్పాల గంగాధర్, రైతులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/రాయికల్ : భూపతిపూర్లో జరగను న్న హిందూ ఆధ్యాత్మిక సదస్సు హిందూ సమ్మేళనం కార్యక్రమం కరపత్రాన్ని శనివారం ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఈ నెల 28 మంగళవారం సాయంత్రం 6:00 నుండి రాత్రి 9:00 వరకు శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో బృంద భజనలు, గోపూజ మరియు హనుమాన్ చాలీసా పఠనం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి అందరూ రావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన,నాయకులు గుర్రం మహేందర్ గౌడ్, జక్కుల చం ద్రశేఖర్, ఏనుగు ముత్యం రెడ్డి, అన్నవేని వేణు మరియు హిందూ సమ్మేళన సభ్యులు సంకోజి మహేష్, ఏలేటి రమేష్, జక్కుల ప్రసాద్, ఏనుగు గంగారెడ్డి, జక్కుల సాగర్, నూకల గంగాధర్, జగన్, మూర్తి, రమేష్,నర్రా రెడ్డి మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ఐకెపి, పిఏసిఎస్ల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పెంబట్ల గ్రామంలో మంగళవారం ఐకెపి, పిఏసిఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ వహిదుద్దీన్, సర్పంచ్ కొలపాక రాధ రాజు తో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని తప్ప తాలు లేకుండా రైతులు శుభ్రం చేసి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, ఏపిఎం చంద్రకళ, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, జిపివోలు, పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



ప్రజాపక్షం/బీర్పూర్ : జగిత్యాల జిల్లా బీరుపూర్ మండల కేంద్రంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు .ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం లో రైతుల సౌకర్యార్థం 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగుతుందని పాక్స్ 67 సెర్ప్ 37 మెప్మా 01 ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కే డిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ల రాంచందర్ రావు, ఎమ్మార్వో సుజాత ,ఎంపీడీవో భీమేష్ ,సర్పంచ్ హరీష్, మాజీ పాక్స్ చైర్మన్ నవీన్ రావ్ ,మండల సర్పంచులు లక్ష్మణ్ ,ఉప సర్పంచ్ దేవాలయ చైర్మన్ చీర్నేని శ్రీనివాస్ ,మండల నాయకులు నారపాక రమేష్ ,రవి ,శీలా, రమేష్ ,కృష్ణ రావు ,సిఇవో, ఏపిఎమ్ ,వ్యవసాయ శాఖ అధికారులు ,ఉపసర్పంచ్ లు, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ అత్యధిక పనిదినాలు పూర్తి చేసిన ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని శ్రీరాంపూర్ ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్ అభినందించారు. శనివారం ఎస్ అండ్ పిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 50 మంది సిబ్బందికి ఆయన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గనులు, కార్యాలయాల భద్రతలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది మార్చి వరకు మొత్తం 211 పనిదినాల్లో 200కు పైగా డ్యూటీలు చేసిన వారిని ఈ బహుమతులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టర్ స్వయంగా తన సిబ్బందిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, సింగరేణిలో ఇలా జరగడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ సంస్థ ఆస్తులను కాపాడాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఓటూ జిఎం ఎన్ సత్యనారాయణ, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ ఉప్పు ప్రసాద్, ఇన్స్పెక్టర్ శంకర్, కాంట్రాక్టర్ శ్రీనివాస్, పిట్ సెక్రటరీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

## జూనియర్ సానిటరీ ఇన్స్పెక్టర్ పోస్టింగ్ వెబ్ కౌన్సెలింగ్

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : సింగరేణి సంస్థలో జూనియర్ సానిటరీ ఇన్స్పెక్టర్ (గ్రేడ్‌డి) పోస్టుల భర్తీకి శనివారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డిజిఎం పర్సనల్ ఎస్ అనిల్ కుమార్ తెలిపారు. ఇంటర్నల్ రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఎంపిక కోసం శ్రీరాంపూర్ జిఎం కార్యాలయంలో ఈ ప్రక్రియ చేపట్టారు. అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 9 ఖాళీలకు గాను అభ్యర్థులు తమకు నచ్చిన ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారని పేర్కొన్నారు.శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఐదుగురు, కార్పొరేట్, ఆర్జి1, ఆర్జి2, మందమర్రి ఏరియాల నుంచి ఒక్కొక్కరు చొప్పున అభ్యర్థులు పాల్గొని ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. పోస్టింగ్ ఎంపికలో అభ్యర్థులకు పూర్తి స్వేచ్ఛ కల్పించామని, ఎవరైనా కేటాయించిన పోస్టింగ్‌ను తిరస్కరిస్తే మూడేళ్ల పాటు అర్హత కోల్పోతారని అనిల్ కుమార్ స్పష్టం చేశారు. రాత పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులు తమ వ్యక్తిగత నిర్ణయం మేరకు పోస్టింగులను ఎంచుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా డివైపిఎం రాజేష్, సీనియర్ పిఓ మురళి, ఐఈడి ఇంజనీర్ సంగీత, సీనియర్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.



# 12వ వేజ్ బోర్డు కోసం బిఎంఎస్ ఆందోళనలు

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి బొగ్గు గని కార్మికుల 12వ వేజ్ బోర్డు కమిటీ ఏర్పాటులో కోల్ ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే5 గనిపై ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం గడువు 2026 జూన్ 30తో ముగియనున్నప్పటికీ, కొత్త కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఒడిశాలో జరిగిన అఖిల భారతీయ ఖనిజ మజ్దూర్ సంఘ్ వర్కింగ్ కమిటీ సమావేశంలో యాజమాన్యాల కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించినట్లు సత్తయ్య పేర్కొన్నారు. వేతన అసమానతలు, డిపిఈ నిబంధనల వల్ల కోల్ ఇండియాపై రూ.3500 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని, దీని సాకుతో కార్మికుల సంక్షేమ పథకాలు, సెలవుల్లో కోతలు విధించడం అన్యాయమని విమర్శించారు. వెంటనే 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గనుల వద్ద ద్వార సమావేశాలు, జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు నిరసనలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ నాయకులు జీడి ప్రభాకర్, భూంపల్లి రమేష్, మేకల స్వామి, కొమ్మ బాపు, కుమ్మరి చంద్రశేఖర్, రాజు ప్రశాంత్, అరుణ్ సంపత్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై బిఆర్ఎస్ అబద్ధపు ప్రచారం

**ప్రజాపక్షం / రెబ్బన :** కాళేశ్వరం అవకతవకల బాధ్యులకు హైకోర్టు క్లీన్ షీట్ ఇవ్వలేదని, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని రెబ్బన మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేసరి కిషన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె ప్రకాష్ రావు విమర్శించారు. మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విచారణ కమిషన్ జీవోను కొట్టివేయాలని చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించిందని గుర్తు చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ప్రాజెక్టుల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి జరగకపోతే సిబిఐ విచారణకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగిపోవడం, పంప్ హౌస్‌లు దెబ్బతినడమే ప్రాజెక్టు నాణ్యత లోపాలకు నిదర్శనమని పేర్కొన్నారు. విచారణ నుంచి తప్పించుకునేందుకు బిజెపితో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటేశం చారి, పి. స్వప్న, రత్నం లక్ష్మి , కొండపల్లి వెంకటేష్, పూదరి లక్ష్మి , పాలగాని బుజ్జక్క, దారావత్ అరుణ, చలూరి మాయ, చల్లూరి ఆత్మరామ్, చౌదరి సుభాష్, నగరం శంకరమ్మ, సంధ్యారాణి, నాయకులు సోమశేఖర్, ప్రకాష్ రావు, కొవ్వూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఎన్‌సీడబ్ల్యుఏ ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి ఏరియాకు చెందిన ఎన్‌సీడబ్ల్యుఏ ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్ శనివారం స్థానిక సీఈఆర్ క్లబ్ ఆవరణలో పారదర్శకంగా నిర్వహించారు. సీనియారిటీ ప్రాతిపదికన జరిగిన ఈ ప్రక్రియలో అర్హత కలిగిన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మొత్తం 93 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 158 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం సీనియారిటీని ప్రమాణంగా తీసుకుని నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో 19 మందికి క్వార్టర్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత స్పష్టతతో ఈ కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని డిజిఎం (ఐఈడి) కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఆర్. వీణ పర్యవేక్షించారు. పారదర్శక విధానం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.



## వంద శాతం ఉత్పత్తి సాధించిన బెల్లంపల్లి ఏరియాకు అభినందనలు

**ప్రజాపక్షం / రెబ్బన :** సింగరేణి వ్యాప్తంగా గత వార్షిక సంవత్సరంలో బెల్లంపల్లి, సత్తుపల్లి ఏరియాలు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయని డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె వెంకటేశ్వర్లు అభినందించారు. శనివారం ఆయన బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర రెడ్డితో కలిసి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఆధునీకరించిన ల్యాబ్, అవుట్ పేషంట్ గైనిక్, జనరల్, ఆర్థో బ్లాక్ లను ప్రారంభించారు. అనంతరం ఖైరిగుర ఉపరితల గని విస్తరణ పనులను పర్యవేక్షించి, వ్యూ పాయింట్ నుండి ఓసి పనిస్థలాలను పరిశీలించారు. ప్రస్తుత వార్షిక సంవత్సరంలోనూ గత ఏడాది మాదిరిగానే వంద శాతం ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని అధికారులకు, కార్మికులకు సూచించారు. ఇదే సమయంలో ఓసి ఆవరణలో నూతనంగా నిర్మించిన 60 టన్నుల డంపర్ మరమ్మతుల షెడ్ ను ప్రారంభించారు. సంస్థ అభివృద్ధిలో కార్మికుల కృషి మరువలేనిదని ఆయన పేర్కొన్నారు.ద్యాగం మల్లేష్, రీజియన్ జిఎం వీరభద్రం, ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ జి కృష్ణ మూర్తి, ఇంచార్జి ఎస్ఓటూ జిఎం ఎన్ ఉమాకాంత్, డివైసిఎంఓ పాండురంగాచారి, డిజిఎం ఎస్కె మదీనా భాషా, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్, హెచ్ఓడి ఎస్వి రాజేశ్వర్ రావు, పిట్ కార్యదర్శులు శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# సింగరేణి సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికులు సమ్మెకు దిగకముందే వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆర్టీసీ కార్మికుల మాదిరిగానే సింగరేణి ఉద్యోగుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సంస్థకు చెందిన రూ.11,500 కోట్ల మిగులు నిధులను దారిమళ్లించి, రూ.29,000 కోట్ల బకాయిల భారాన్ని మోపిందని ఆరోపించారు. సొంతింటి పథకం అమలు, ఇన్కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, మెరుగైన పదోన్నతులు, నూతన ప్రాజెక్టుల ఏర్పాటు వంటి 15 ప్రధాన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ సారథ్యంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఆందోళనలు చేపట్టకముందే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణిని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించి కార్మికుల సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

## వాసవి జయంతి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల విశ్వనాథఆలయంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలలో హాజరై అమ్మవారి శోభాయాత్రను ప్రారంభించాలని వాసవి మాత జయంతి ఉత్సవాల కమిటి ఛైర్మన్ ముక్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటి సభ్యులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఆహ్వానించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో ఉత్సవాల కమిటి తరుపున కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు. మంచిర్యాల వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో ఉత్సవాల కమిటి నేతృత్వంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక అర్చనలు, అభిషేకములు, సామూహిక మహిళలచే కుంకుమ పూజలు, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సాయంత్రం మంచిర్యాల పుర వీధుల గుండా భారీ ఎత్తున అమ్మవారి ఉత్సవ విగ్రహంచే శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవిక్లబ్స్ నాయకులు కటుకం హరీష్, కేశెట్టి వంశీకృష్ణ, కొంకుముట్టి వెంకటేశ్, కాచం సతీష్, చిలువేరు వైకుంఠం, చిలువేరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జిఓ విడుదల చేయడంతో మంచిర్యాల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు అధికారంగా ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. స్థానిక వైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించిన అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. వైశ్య సంఘాలు, వాసవిక్లబ్స్ నాయకులు ముక్త శ్రీనివాస్, మాదంశెట్టి సత్యనారాయణ, కటుకం హరీష్, సిరిపురం రాజేశ్, కేశెట్టి వంశీకృష్ణ, కొంకుముట్టి వెంకటేష్, దొంతుల ముఖేష్, చిలువేరు శ్రీనివాస్, పుత్తూరి రమేష్, ఇరుకుల్ల శ్రీనివాస్, అక్కెనపెల్లి రవీందర్, నాగిశెట్టి శ్రీనివాస్, తాటిపల్లి సాయి వర్ధన్, ఇరుకుల్ల సూర్యనారాయణ, పడకంటి శ్రీనివాస్, వెనిశెట్టి రాఘవేంద్ర, ముక్త విశ్వాస్, కాసం మల్లిఖార్జున్, పాత సాయిసూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాత జయంతికి రాష్ట్ర పండుగ హోదా

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** శ్రీ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆర్యవైశ్యులు శనివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాగజ్‌నగర్ వాసవి కళ్యాణ మండపంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత చిత్రపటానికి కూడా క్షీరాభిషేకం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రావు, చిలువేరు సత్యనారాయణ, కె. శంకరయ్య, జి. చక్రపాణి, ఆనంతుల సురేష్, పైడా శ్రీనివాస్, మైలారం మురళీధర్, కోడిపాక కృష్ణమూర్తి, గణపవరం ప్రకాష్, జి. గోపాల్, జి. సురేష్, కు. సత్యనారాయణ, సురేందర్, టీ. నగేష్, జక్కు సురేష్ పాల్గొన్నారు.

## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

### అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** అధికారులు క్షేత్రస్తాయిలో పర్యటించాలని పనుల్లో నాణ్యతతో పాటు వేగం అవసరమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ అదికారులతో నగరంలో కొనసాగుతున్న యుజిడి, వాటర్ వర్క్స్, పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుజిడి, వాటర్ వర్క్స్, ఇంటింటికి నల్లా కనెక్షన్లు తదితర పనులను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులలో వేగం పెంచాలని అన్నారు. సంబంధిత అదికారులతో క్షేత్రస్తాయిలో పర్యటించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ డిఈ నగేస్, ఏ.ఈ. లు వీణ, శివకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

## లోకేశ్వరంలో నూతన బాధ్యతలు చేపట్టిన ఎంఆర్ఓ



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో నూతన ఎం.ఆర్.ఓ.గా సూర్యారావు బాధ్యతలు చేపట్టారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో ఏ.ఓ. గా సేవలు అందించి బదిలీపై లోకేశ్వరంకు ఎం.ఆర్ఓ.గా బాధ్యతలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## న్యూ లోలంలో ప్రపంచ మలేరియా దినోత్సవం



**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని న్యూ లోలం గ్రామంలో మలేరియా జ్వరాలపై అవగాహన సదస్సును కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్, ఉప సర్పంచ్ ముత్యం ఆద్వర్యంలో నిర్వహించడం జరిగింది. హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమలు, వృద్ధి చెందకుండా, నీటి నిల్వలు లేకుండా చేయాలి, మన ఇంటి పరిసరాలు శుభ్రంగా, చెత్త లేకుండా, పనికి రాని వస్తువులు ఉంచకుండా చూడాలి, జ్వరం లక్షనాలు చలితో కూడిన జ్వరం, తలనొప్పి, నీరసంగా ఉంటారు, ఆరోగ్య సిబ్బంది ఇలాంటి వారికి ఆర్.డి.టి.కిట్‌తో పరీక్ష జరిపి తగిన మందులు ఇస్తారు మరియు ప్రతి మంగళవారం , శుక్రవారం లలో ఆరోగ్య గ్రామ పంచాయతీ, అంగన్వాడీ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి తగు జాగ్రత్తలను తెలుపుతారు. నీటి నిల్వలను తొలగిస్తారు, దోమతెరలను వాడుట మంచిది, జ్వర బాధితులు దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి వైద్యాధికారి సూచనల మేరకు తగు పరీక్షలు చేసుకొని మందులు వాడాలని తెలిపారు. సోని, ఎం.ఎల్.హెచ్.పి, ఎ.ఎన్.ఎం. ఉమారాణి, లలిత, ఆశా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శబరిమాటా వార్షికోత్సవంలో పాల్గొన్న ఆడే గజేందర్

**ప్రజాపక్షం / బోథ్ :** భోథ్ మండలంలోని శబరిమాత ఆశ్రమంలో వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్దలతో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భోథ్ నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడె గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. ఆడె గజేందర్ మాట్లాడుతూ శబరిమాతా ఆశ్రమం ఆద్యాత్మికంగా ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఇటువంటి కా ర్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొదిస్తాయని అన్నారు. భక్తులకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా ఆశ్రమానికి తన సహకారం కొనసాగుతుందని తెలిపారు.

## యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న : ఎమ్మెల్యే




**ప్రజాపక్షం / బోథ్ :** ఆయన సేవే ఆయనను గుర్తించింది. బోథ్ గిరిజన ఎం.ఎల్.ఏ. గా గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న సేవలు, ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకున్న సందర్భాలు, ఎల్లప్పుడూ ప్రజల కోసం, ఎండనక, వాననక, నమ్ముకున్న ప్రజల కోసం దేన్ని లెక్క చేయకుండా బోథ్ ఎం.ఎల్.ఏ. అనీల్ జాదవ్ చేసిన సేవలను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ లీడర్షిప్ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదర్శన కార్యక్రమంలో బోథ్ ఎం.ఎల్.ఏ. అనీల్ జాదవ్ హాజరై డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా బోథ్ ఎం.ఎల్.ఏ. అనీల్ జాదవ్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజా సేవలో కొనసాగుతూ వారి అభివృద్ధికి కృషి చేయడం ఆనందంగా ఉందని, ప్రజల్లో కలిసిపోయి ఉండటం ముందు నుండి అలవాటని ఆ సేవలే నన్ను గుర్తించి డాక్టరేట్ తీసుకునే వరకు తీసుకొచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని ఉధృతం చేయండి



**ప్రజాపక్షం / భైంసా :** మే డే స్పూర్తి తో కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం అని భారత కార్మిక సంఘాల సమాఖ్య (IFTU) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. హరిత పిలుపునిర్చారు. శనివారం భైంసా మండలం వానల్‌పాడ్‌లో మే డే పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐరోపాలో జరిగిన పారిశ్రామిక విప్లవం నుండి ఆదునిక కార్మిక వర్గం ఉధ్బవించిందని కొత్త యాంత్రీకరణ ఆవిష్కరణలతో పోటీ పడలేక పనిగంటలను తగ్గించాలని కార్మిక వర్గం పోరాడిందని మే ఒకటి 1986 న అమేరికాలోని చికాగోలో 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులు, నిరసనలు, ఆందోళనలు చేపట్టారని, పెట్టుబడిదారి వర్గం ఈ శాంతియుత ప్రదర్శనలపై కాల్పులు జరిపిందని, కార్మికులు తూటాలకు బలయ్యారని తిరుగుబాటు నాయకులను ఉరితీసారని కేసులు పెట్టి తీవ్ర అణచివేతకు పాల్పడి జైలు శిక్షలు విధించారని ఈ కార్మికుల బలిదానాల రక్త దర్పణలతో మే డే చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. కార్పోరేట్ పెట్టుబడి దారులకు కార్మికుల రక్తాన్ని దార బోసే చట్టాలను కేంద్రం చేస్తూ కార్మికులను బానిసలుగా మారుస్తున్నదని లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని ఉధృతం చేయండి అనే పిలుపుతో 140మే డే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, నరేందర్, భారతి, లక్ష్మి , శ్యామల, వనిత పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వాసవి మాత జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్:** నిర్మల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రొజైన శనివారం నాడు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్ పర్యవేక్షణలో కమల్‌రోడ్, చిలివేరి భవన్ నాయుడివాడలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారే వార్ కృష్ణ శర్మ గారి పర్యవేక్షణలో తెల్లవారు జామున 6 గంటల నుండే భక్తి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి తొలుత నగర సంకీర్తనతో పట్టణం మారుమోగగా, అనంతరం గోమాత పూజను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి గౌరీ పూజ, పంచగన్య ప్రాసన, పూర్ణ కళశ స్థాపనతో పాటు 108 (ఏకవింశతి) కలశ స్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. మధ్యాహ్నం 11 గంటల సమయంలో శ్రీ వాసవి హోమం నిర్వహించి లోక కళ్యానార్థం పూర్ణాహుతి గావించారు. హోమ కార్యక్రమం అనంతరం భక్తులందరికి భారీగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సామాజిక దృకృథంతో స్థానిక వృద్దాశ్రమంలోని 23 మంది వృద్దులకు నూతన దుస్తులను పంపిణీ చేసి ఆర్యవైశ్య సంఘం తమ ఉదారతను చాటుకుంది. ఈ వేడుకలు ''న భూతో న భవిష్యత్''అనే రీతిలో అత్యంత ఘనంగా జరిగాయని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విశేష పూజ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్, ఆలయ చైర్మెన్ పార్దికర్ నారాయణ, గంప అనిల్, పొలిశెట్టిశైలేష్ లింగంపల్లి లక్ష్మీ నారాయణ, పొల్దె మహేందర్, పొలిశెట్టి విలాస్, కత్తూరి శ్రీనివాస్, శక్కరి వినాయక్, తాండ్ర సుగుణాకర్, చౌడారపు సంతోష్, పడిగెల గణేష్, చిన్నావరవ పూర్ణేందర్ , పడిగెల శివ, వావిలాల మారుతి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పట్టణ మహిలా అధ్యక్షురాలు బుడిమె శ్రీమాల , కోశాదికారి శ్రీ లక్ష్మి మరియు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## మలేరియా రహిత సమాజం కోసం పరిశుభ్రత పాటించాలి

### అవగాహన సదస్సులో ఆరోగ్య సిబ్బంది పిలుపు

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని న్యూ లోలం గ్రామంలో మలేరియా జ్వరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్ మరియు గ్రామ ఉప సర్పంచ్ ముత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు మలేరియా వ్యాప్తి నివారణోపాయాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాటత్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ఇళ్ళ పరిసరాల్లో నీరు నిల్లవ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తా చెదారం మరియు పనికిరాని వస్తువులను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చలితో కూడిన జ్వరం, తలనొప్పి నీరసం వంటివి మలేరియా లక్షణాలని అటువంటి వారు వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదిస్తే ఆర్డిటి కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజుల్లో ఆరోగ్య గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి ఒంటిని సందర్శించి నిల్వ ఉన్న నీటిని తొలగిస్తే ప్రజలకు అవసరమైన జాగ్రత్తలు వివరిస్తారని పేర్కొన్నారు. దోమకాటు నుండి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడడం శ్రేయస్కరమని జ్వర బాదితులు స్వయం వైద్యం చేసుకోకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి వైద్యాధికారి సూచనల మేరకు రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోని, ఏ.ఎన్.ఎం. ఉమారాణి, లలిత, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాప్పింగ్ వివరాలు సమర్పించాలి



**ప్రజాపక్షం/వాంకిడి :** ఓటర్ల మ్యాప్పింగ్ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మండల ప్రజలు తమ వివరాలను వెంటనే సమర్పించాలని వాంకిడి తహసీల్దార్ కవిత సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో ఓటర్ల వివరాల నమోదు, మ్యాప్పింగ్ ప్రక్రియ కొనసాగుతోందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఓటరు నమోదులను ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అనుసంధానం చేసేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. ముఖ్యంగా 2002 సంవత్సరంలో ఏ ప్రాంతంలో నివాసం ఉండి ఓటు నమోదు చేసుకున్నారో, ఆ ప్రాంతానికి సంబంధించిన నియోజకవర్గ సంఖ్య, పోలింగ్ కేంద్రం సంఖ్య, ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య వివరాలు అందించాలని కోరారు. ఈ వివరాల ఆధారంగా ప్రస్తుతం నివసిస్తున్న గ్రామం లేదా వార్డుకు ఓటు హక్కును మ్యాప్పింగ్ చేస్తామన్నారు. పాత వివరాలు తెలియని వారు అందుబాటులో ఉన్న పాత ఓటరు కార్డు లేదా కుటుంబ సభ్యుల వివరాలతో బూత్ స్థాయి అధికారులను (బిఎల్ఓ) సంప్రదించాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించి బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## ఉద్‌గిరి కుంటకు మరమ్మతులు ప్రారంభించిన సర్పంచ్

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజూర గ్రామంలోని కుంటవద్ద ఇరిగేషన్ నిధులతో 14 లక్షల రూపాయల పనులు సర్పంచ్ శ్యామల ముత్తాగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కుంట వద్ద నీటి నిల్వ కొరకు నూతన తూము నిర్మించడం జరుగుతుందని జెసిబి సాయంతో కట్ట వద్ద మొత్తం పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించడం మరియు మొరం పోయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏ.ఇ. ఇ.మనోజ్ కుమార్, రాహుల్, నాయకులు సాయి ప్రసాద్, పోలాస ముత్యం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబివి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటి, జెఈఈ శిక్షణ

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వేసవి శిభిరాన్ని నిర్మల్ జిల్లా విద్యాధికారి భోజన్న శనివారం రోజున సందర్శించారు. డి.ఇ.ఓ. మాట్లాడుతూ దిలావర్‌పూర్ కేజీబివి ''ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్''కు ఎన్నికైనందున ఇంటర్ విద్యార్థులకు ఐఐటి, జెఈఈ శిక్షణ ఇవ్వడం చాలా సంతోషకరమని విద్యార్థులందరూ కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని క్రమశిక్షణ పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సదానందం, ప్రిన్సిపాల్ అపర్ణ, పిజిసిఆర్టి లు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రభుత్వ విద్యా సంస్తలలో విద్యా సంవత్సరానికి ముందరే మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సుబోధ్ అన్నారు. శనివారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నగర సమితి సమావేశం ఏర్పాటు చేశారు. ఇంకో 45 రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నూతన విద్యా క్యాలెండర్ అనుసరించి కెజి నుంచి పిజి వరకు ప్రభుత్వం విద్యా సంస్థలలో మౌలిక వసతుల కల్పన, పునరుద్దరించవలసిన నిర్మాణాలు ముందుగానే చేయాలని వేసవి సెలవులను మరమ్మతులకు వినియోగించుకుని నూతన విద్యా సంవత్సరానికి కావలసిన అన్నిపనులు పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు కిషోర్, దిలీప్, గణేష్, నిరాజ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై రాళ్లు పరిచారు ధాన్యం తీశారు...

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని చౌట్‌పల్లి నుండి అమీర్‌నగర్ వెళ్లే రోడ్డుపై ధాన్యం ఆరబోసి వడ్లు కదలకుండా రోడ్డు పక్కన రాళ్లను పెట్టారు. ఆరిన ధాన్యం తీసేసిన తర్వాత రాళ్లను తీయటం మరిచారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ఈ రాళ్లను గమనించలేక వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో రోడ్డుపై వదిలేసిన రాళ్లను పోలీసులు తీసిన సంఘటనలున్నాయి. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం చట్టరీత్య నేరం. వాహనదారులు ప్రమాదాలకు గురైతే సంబంధిత రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించే అవకాశముందని పోలీసులు గతంలో హెచ్చరించారు. అయినా తీరు మారలేదు.

## దెబ్బతిన్న డ్రైనేజీ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ముప్కాల్ :** మండలంలోని నాగంపేట్ గ్రామంలో సీసీ రోడ్డు వేసే క్రమంలో దెబ్బ తిన్న డ్రైనేజీ పనులను శనివారం ఉదయం గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతు పనులు ప్రారంభించామని సర్పంచ్ దాసరి గంగాధర్ తెలిపారు. గ్రామంలో సీసీ డ్రైనేజీ పనులు చేస్తున్నప్పుడు అక్కడక్కడ డ్రైనేజీలు దెబ్బ తినడంతో తిరిగి మరమ్మతు పనులను పూర్తి చేస్తున్నట్లు సర్పంచ్ అన్నారు. ఉప సర్పంచ్ మదన్‌కుమార్, సభ్యులు గంగామణి, ముత్తెన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

## 27 నుండి సమాచార సేకరణ జనగణనపై శిక్షణ

**ప్రజాపక్షం/ముప్కాల్ :** ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో క్షేత్రస్థాయి సమాచార సేకరణ జనగణన 2027 లో బాగంగా ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లకు ఛార్జీ ఆఫీసర్ తహసీల్దార్, ఎంఈఓ ఆధ్వర్యంలో జనగణనకు సంబంధించిన ట్రేనింగ్ పోగ్రాం నిర్వహించబడుతుందని తహసీల్దార్ ముంతాజోబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 32 మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

## ముగిసిన జనగణన శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/బాల్కొండ :** జనగణన 2027 లో భాగంగా ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు మండలంలో 2 విడతల శిక్షణ తరగతులతో శిక్షణ పూర్తయింది ఛార్జ్ ఆఫీసర్, మండల తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ఇళ్ల జాబితా, జనాభా లెక్కల సేకరణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. తొలిసారిగా పేపర్ రహితంగా మొబైల్ దరఖాస్తు ద్వారా జనగణన జరగనుండటంతో ఎన్యుమరేటర్లకు మొబైల్ యాప్ వాడకంపై ప్రత్యేక శిక్షణనిచ్చి మాట్లాడారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిజాయితీగా బాధ్యతాయుతంగా వినయంగా మర్యాదగా, పారదర్శకంగా ఓర్పుతో ఖచ్చితంగా సమాచారాన్ని సేకరిస్తామని ప్రమాణం చేశారు. ఈ శిక్షనా శిబిరంలో ఫీల్డ్ ట్రేనర్లు నరేందర్, అయిలాపురం రాజు, జూనియర్ అసిస్టెంట్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం సేకరణలో పారదర్శకతే లక్ష్యం

### బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా వరి సేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా , సమర్థవంతంగా నిర్వహించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో అధికారులను ఆదేశించారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్నరి ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా కీలక సూచనలు చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ సిస్టమ్‌లో వేగవంతంగా నమోదు చేయాలి. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలి. ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారానే రైతుల వివరాలను అనుసంధానం చేసి ధాన్యం డబ్బులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కేంద్రం సందర్శన అనంతరం గ్రామ శివారులోని ఇటుక బట్టీలను సబ్ కలెక్టర్ సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికుల సంక్షేమంపై యజమానులతో మాట్లాడారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు పొందేలా అధికారులు, యజమానులు అవగాహన కల్పించాలి. దీనివల్ల కార్మికులకు సామాజిక భద్రత చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఇతర ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్, ఐకేపీ, ఏపీఎం రాజేందర్, సీసీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన జనాభా గణన శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** 2027 జనాభా గణన ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ శిక్షణ వారం రోజుల పాటు రెండు బ్యాచులుగా 84మంది ఉపాధ్యాయులకు కొనసాగింది. జనాభా గణనలో మొదటి దశ అయిన ఇళ్ల జాబితా గృహ గణన పై దృష్టి సారించడం జరిగిందని తహసీల్దార్ దత్తాత్రి తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎన్యుమరేట్లకు గణన విధులను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రశ్నావళి మొబైల్ యాప్ వినియోగం, ఇంటింటి సర్వే విధానాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో జడ్పీ పాఠశాలల్లో జరిగిన శిక్షణ ముగింపు సమావేశానికి మండల విద్యాధికారి గాలప్ప, హాజరై సూచనలు అందించారు. ఈ శిక్షణ పొందిన సిబ్బంది మే 1వ తేది నుంచి ఇళ్ల జాబితా సేకరణను ప్రారంభించనున్నారన్నారు. అంతేగాకుండా ప్రజలు స్వీయ గణనను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ప్రభుత్వం స్వీయ గణన చేసుకొనుటకు అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ ఛార్జ్ ఇందు ట్రైనర్ బస్వంత్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# జైతాపూర్‌లో సేవా కార్యక్రమాల వెల్లువ



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజుగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ఆదర్శంగా నిలిచింది. గ్రామ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఒకరి ప్రాణాన్ని కాపాడే రక్తదానంలో యువకులు ఇంత ఉత్సాహంగా పాల్గొనడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధి హామీ కార్మికులు సర్పంచ్ రాజుగౌడ్ సమాక్షంలో కేక్ కట్ చేసి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తూ సంబరాల్లో పాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ట్రస్మా అధ్యక్షులు కొడాలి కిషోర్, లయన్ సూర్య నారాయణ మాట్లాడుతూ.. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా సమాజానికి మేలు చేసే రక్తదాన వంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జైతపూర్ యువత స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు జరగాలని వారు ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దీనికి సహకరించిన యువతకు, గ్రామ పెద్దలకు తన హృదయ పూర్వక కృతజ్ఞతలను సర్పంచ్ రాజుగౌడ్ తెలిపారు. ఆత్మ కమిటీ ఛైర్మన్ కృష్ణరావు, గ్రామ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు అల్తాఫ్, సతీష్, రవి, రెడ్ క్రాస్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** ప్రభుత్వ ఆదేశాల మేరకు పాత బస్టాండ్ ఏరియాలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రంను శనివారం ఏర్పాటు చేశామని కమీషనర్ గోపు గంగాధర్ తెలిపారు. చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని, కిరాణా వర్తక సంఘం యూనియన్ సభ్యులు వారి తరపున మంచినీటిని ఉచితంగా సరఫరా చేయడానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్, అంజుం అలీ, నరేందర్, సభ్యులు రవి, సూరజ్, అనిల్, అభిలాష్, రాజు, దినేష్, నవీన్ పాల్గొన్నారు.

## నర్సరీ ప్లాంట్లను పరిశీలించిన ఎంపిడిఓ

**ప్రజాపక్షం/ఆర్మూర్:** మండలంలోని చేపూర్ పల్లె గ్రామాల్లో నర్సరీ ప్లాంట్లను ఎంపీడీఓ బాలే శివాజీ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం చేపూర్ పల్లె గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరికైనా ఇందిరమ్మ ఇల్లు మంజురయ్యాయో రెండు మూడు రోజులలో మగ్గురు పోయకపోతే ఆ ఇళ్లు క్యాన్సల్ అవుతాయని ఆయన లబ్దిదారుకు తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పనుల వివరాలు, నర్సరీల పెంపకాలు తదితర విషయాలను ఫీల్డ్ అసిస్టెంట్ రజితను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు చేపూర్ పల్లె సర్పంచ్‌లు సారంగి శాంతి కుమార్, పార్దేమ్ మనీషా సంజీవ్, ఉపసర్పంచ్ సింధుకర్ చరణ్, పంచాయతీ సెక్రటరీ లోక హరీష్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని కాల్వ గ్రామంలో శనివారం రోజున సర్పంచ్ బ్యాగరి రోజా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ నిర్మల్ ఎం.ఎల్.ఏ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాల్వ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు గ్రామంలో మొక్కజొన్న పంట అధికంగా ఉండడం వల్ల రైతులకు మద్దతు ధర దక్కాలనే ఉద్దేశ్యంతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం సబ్ సెంటర్‌ను మంజూరు చేయాలని వితని పత్రం అందించడం జరిగింది. ఎం.ఎల్.ఏ. స్పందించి సబ్ సెంటర్‌ను మంజూరు చేయడం జరిగింది. గ్రామ రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర 2400కు అమ్ముకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఓ అశోక్, ఉప సర్పంచ్ హరికృష్ణ , నర్సారెడ్డి, బ్యాగరి సుధాకర్, లింగన్న, శ్రీకాంత్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకు సర్పంచ్, రత్నాపూర్ కాండ్లీలో 'మార్నింగ్ వాక్' ద్వారా సమస్యల గుర్తింపు

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** నిర్మల్ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామ సంర్పచ్ గడ్డం హరీష్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు, శనివారం ఉదయం గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ళ కాలనీలో ఆయన మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం వేళ కాలనీలో కలియ తిరుగుతూ ప్రజలను నేరుగా కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ఈ మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కేవలం ఒక్క రోజుతో ముగించకుండా ప్రతి రోజూ గ్రామంలో పర్యటిస్తూ వార్డు సభ్యులు, గ్రామ పద్దెలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాలనీ వాసులకు ఎదురవుతున్న వివిద సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్ళగా వాటిని సానుకూలంగా స్పందిస్తే త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో తమకు సహకరించిన వార్డు సభ్యులకు గ్రామస్తులకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్:** బానుడి భగభగలతో ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, విధుల్లో ఉండే ఆర్టీసి ఉద్యోగులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు నిర్మల్ డిపో మేనేజర్ కె.పండరి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండలో నిరంతరం శ్రమిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు ఇతర సిబ్బందికి ఉప శమనం కలిగించే ఉద్దేశంతో డిపోలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ విధులకు హాజరయ్యే ప్రతి డ్రైవర్ కండక్టర్ తప్పనిసరిగా వెంట మజ్జిగ ప్యాకెట్లు తీసుకెళ్ళాలని సూచించారు. అలాగే ఎండల దృష్ట్యా తలకు టవల్ ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ మజ్జగ పంపిణీ కార్యక్రమం వేసవి కాలం ముగిసే వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఇ. (ఎం) నవీన్ కుమార్, విజిలెన్స్ హెడ్ గార్గ్ శ్రీనివాస్ తోపాటు డిపో కార్యాలయ సిబ్బంది మెకానిక్‌లు, డ్రైవర్లు , కండక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెడికవర్ హాస్పిటల్‌లో.. ఆధునిక సాంకేతిక, సమగ్ర వైద్య విధానం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 53000 కు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా ప్రతి పది నిమిషాలకు ఒక కొత్త కేసు వెలుగులోకి వస్తోందని అంచనాలు సూచిస్తున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ముఖ్యంగా నిజామాబాద్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ నిపుణులు మెడికవర్ హాఇస్పటల్స్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యులు రవి చందర్, అన్వేష్, సంపత్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ముఖ్యంగా బ్రెస్ట్, సర్వికల్, మౌత్, లంగ్ క్యాన్సర్ కేసులు అధికంగా కనిపిస్తున్నాయి. జీవనశైలి మార్పులు, పొగాకు వినియోగం, ఆలస్యంగా పరీక్షలు చేయించుకోవటం ప్రధాన కారణాలు ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు వారి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం మండలంలోని కనుకుల, రాముని పల్లి, మంచిరామి, తొగర్రాయి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు హాజరు కాగా ప్రత్యేక అధికారి మహమ్మద్ అలీ సహకార సంఘం సీఈఓ బొంగోని దేవేందర్ ఘన స్వాగతం పలికి శాలువా తో ఘనంగా సత్కరించారు. అనంతరం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి గింజ కటింగులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.అన్ని గ్రామాలలో ఐకెపి సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.రైతులెవరు ధైర్యపడవద్దని ప్రభుత్వం పూర్తి కొనుగోలు చేపట్టి మద్దతు ధరను అందిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు విధిగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం మ్యాచర్ వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. రెండున్నర సంవత్సరాల కాలంలో 5 పసళ్ళు గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేపట్టామని గత ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని 15 నుండి 20 కిలోల వరకు కటింగ్లు చేపట్టారని అన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా ఉందని భరోసా కల్పించారు.ఈ కార్యక్ర



మంలో సర్పంచులు కర్రే కవిత కుమార్, ఉప్పు లక్ష్మి ,చిలుక స్రవంతి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు రైతు సెల్ మండల అధ్యక్షులు పన్నాల రాములు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తో పాటు రైతులు, పలువురు పాల్గొన్నారు.

## మలేరియా రహిత గ్రామంగా కొడకండ్లను తీర్చిదిద్దుకుందాం

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మలేరియా రహిత గ్రామంగా కొడకండ్లను తీర్చిదిద్దుకుందామని సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. శ నివారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మలేరియా అవగాహన గ్రామసభలో వారు మాట్లాడుతూ దోమల నివారణ కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వైద్య అధికారి భారతితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిపికార్యదర్శి ఆంజనేయులు, వా ర్డు సభ్యులు అందె అరుణ్ కుమార్, వంశీ కృష్ణ, ఏఎన్ఎం సాయిదమ్మ, ఆశలు, పాల్గొన్నారు.

## భార్యను చంపి ... ఉరేసుకున్న భర్త

**ప్రజాపక్షం/సంగారెడ్డి:**జిల్లాలోని సదాశివపేట లోహృదయ విచారక ఘటన చోటుచేసుకుంది . అనుమానంతో భర్యను హత్య చేసిన భర్త అనంతరం తానే ఉరి వేసుకుని ఆత్యహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. సిద్దాపూర్‌కు చెందిన రాజు (40) రాణి( 40) దంపతులు కొంతకాలంగా కుటుంబ కలహాలతో జీవిస్తున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న రాజు శుక్రవారం రాత్రి ఆమెతో గొడవ పడ్డాడు, ఈ క్రమంలో అగ్రహంతో రోకలిబండతో రాణి తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తన చర్యలపై భయాందోళనకు గురైన రాజు , అనంతరం సమీపంలోని వ్యవసాయ భూమికి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో కుటుంబం ఒక్కసారిగా చిద్రమైంది. తల్లిదండ్రులను కొల్పోయిన ఇద్దరు చిన్నారులు అనాథలు మారడం హృదయ విచారకరంగా మారింది. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానిక చేరుకుని మృతదేహాలను స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెంలో విషాదం. గ్రామానికి చెందిన సాదుల నరహరి (58) అనే వ్యక్తి వృత్తిలో భాగంగా శుక్రవారం మోత్కుకు (విస్తార్ల) సేకరణ కోసం గ్రామ శివారులో వెళ్ళగా వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. నిన్నటి నుండి ఇంట్లోనే ఉంటూ శనివారం మరోసారి అస్వథ్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం తెలపడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు.

## ప్రైవేట్ జూనియర్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కాలేజీల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హన్మకొండలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి (డిఐఈఓ) కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ హరితకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రతినిధి బృందంగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బి.నరసింహా రావు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన గ్రామీణ ప్రాంత విద్యార్థి తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పదవ తరగతి ఫలితాలు వెలువడక ముందే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టడంలో సంబంధిత ఇంటర్ విద్యాశాఖ అధికారులు ,రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కాలేజీ పేరిట పర్మిషన్ తీసుకొని 4 నుంచి 10 కి పైగా అదనపు బ్రాంచ్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా నెలకొల్పుకుంటూ ప్రభుత్వాన్ని ,విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రైవేట్ ,కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను అడ్మిషన్ చేయించుకునే ముందు ఎలాంటి అదనపు ఫీజులు తీసుకోమని, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే రెసిడెన్షియల్ హాస్టల్స్ నిర్వహిస్తూ అనేక అబద్దాలతో కూడిన మోసపూరిత మాయమాటలు చెప్పి తీరా అడ్మిషన్ చేయించుకున్న తర్వాత అడ్మిషన్ ఫీజు ,ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్, పరీక్ష, ప్రాక్టికల్, వెల్కమ్, ఫేర్వెల్ పార్టీ, మెటీరి




యల్, ఐఐటి జేఈఈ మెయిన్స్, నీట్ కోచింగ్ అంటూ విద్యార్థులను ఫీజుల పేరిట పీల్చి పిప్పి చేస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత ఇంటర్ విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముందస్తు అడ్మిషన్ లు చేపడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేకుండా అదనపు బ్రాంచ్ లను నిర్వహిస్తున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కాలేజీల గుర్తింపుని తక్షణమే రద్దు చేయాలని,అనుమతి లేకుండా అపార్ట్మెంట్లలో కొనసాగుతున్న కాలేజీలను, వాటికి అనుబంధంగా నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ హాస్టల్స్ ను వెంటనే సీజ్ చేయాలని, ప్రైవేట్ కాలేజీల్లో అధిక ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు వరంగల్‌హన్మకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ వి. కావ్య, కో కన్వీనర్ పి. అనూష, జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, స్వాతి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర భారత వచన కావ్య పర్వాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బండారు రమాదేవి చంద్రమౌళీశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో కవిత్రయం చేత విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని డాక్టర్ బండారు ఉమామహేశ్వరరావు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిబద్ధతతో రచించిన ఆంధ్ర భారత వచన కావ్య పర్వాలు ఆది,సభా,విరాట, ఉద్యోగ పర్వాలను శనివారం వరంగల్ లోని ఐఎంఏ భవన్ లో ప్రముఖ పండితులు ప్రవచన కర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాస రావు ఆవిష్కరించారు. వనం లక్ష్మీకాంతం రావు సంయోజకత్వంలో సాగిన సభలో విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహిస్తూ డిజిటల్ ప్రపంచంలో వచన భారతం రచన సాహసోపేత చర్య అయినా ప్రస్తుత అవసరాలు అన్నారు. విశిష్ట అతిథి తెలంగాణ హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు భారతంలోని ధర్మం యక్షప్రశ్నల ఆధారంగా వివరించారు.డాక్టర్ దహగాం సాంబమూర్తి ఆదిపర్వాన్ని , డా.కసిరెడ్డి వెంకటరెడ్డి సభా పర్వాన్ని,గిరిజా మనోహర బాబు విరాట పర్వం ,డా.ఎన్.వి.ఎన్.చారి ఉద్యోగం పర్వాన్ని తమదైన శైలులలో సమీక్షించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ మహాభారతం రామాయణం భాగవతం ధర్మానికి నైతిక విలువలకు భూమిలోని, శకుంతల వృత్తాతం ఎవరి పని వారే చేయాలనితెలుపుతుందన్నారు.కచదేవయాని స్త్రీమూర్తి ప్రేమతత్వాన్ని, ద్రౌపది సహేతుక ప్రశ్నలతో దుశ్శాసన సభను ప్రశ్నించిన ధీరవనితని కొనియాడారు. శ్రీకృష్ణ దుర్యోధనుల మధ్య చర్చ కృష్ణుని రాజనీతి కి నిదర్శనం మంటూ నాలుగు పర్వాల అంతరార్థాన్ని వివరించారు. రచయిత డాక్టర్ ఉమామహేశ్వర రావు తమ స్పందనలో రచనోద్దేశ్యాన్ని తెలిపారు రచయితను ఘనంగా సన్మానించారు.అతిథులకు మెమెంటో లు అందించారు.అనిల్ ప్రసాద్ వుందని సమర్పణ చేసారు.పురప్రముఖులు పండితులు అనేకమంది హాజరయ్యారు.ఎస్.వి.ఎన్. శర్మ,డాక్టర్ ఎల్.ఎస్.ఆర్.కె. ప్రసాద్,పొట్లపల్లి,వాసిరెడ్డి కృష్ణారావు,వి.ఆర్. విద్యార్థి సిహెచ్. శివరావు,వై. నాగయ్య,వాణి ప్రసాద్,అవధానిచేపూరి శ్రీరామ్,కంది శంకరయ్య,జే.ఎన్.శర్మ,మండువ రామగోపాల్ రావు,మండువ రవీందర్ రావు, వెలుగుప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ చిత్రపటానికి ఆర్యవైశ్యులు పాలాభిషేకం జరిపారు.శ్రీ కన్యకా పరమేశ్వరి వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్ణయించి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ స్థానిక గాంధీ చౌక్ కూడలి ఆర్యవైశ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి దేవస్థాన పాలకమండలి మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు మురికి శ్రీనివాస్,11వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ,గునిశెట్టి రవీందర్,చౌడారపు సతీష్ ,సిరుప రాజేందర్,సురేందర్, సత్యనారాయణ, ముత్తయ్య, బద్రి,పద్మ,భారతి,మనోహర్ పాల్గొన్నారు.

## నృసింహుడిని సన్నిధిలో ఎమ్మెల్సీ వెంకట్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం,జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహ స్వామివారిని శనివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.దర్శనార్థం ఆలయానికి వచ్చిన ఎమ్మెల్సీ వెంకట్ కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. తొలుత ప్రదానాలయం శ్రీ యోగనంద స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్ని అనుబంధ ఆలయాలలోని స్వామివారలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆశీర్వచన మండపంలో అర్చకులు నంబి శ్రీనివాసచార్యులు,చిలుకముక్కు రమణయ్య ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం అందించారు.ఆలయ సూపరింటెండెంట్ కిరణ్,అర్చకులు స్వామివారి శేషవస్త్రంతో ఎమ్మెల్సీని సన్మానించి స్వామివారి చిత్రపటం,ప్రసాదం అందజేశారు.

## ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిర్పూర్ గ్రామ సర్పంచ్ పెంట సౌజన్య శ్రీనివాస్ అన్నారు.ఈ మేరకు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి,అత్యవసరదృష్ట అవసరమగు మందులను అందజేశారు. కూలీలకు పని ప్రదేశంలో, నెట్లు త్రాగునీరు,వసతులు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఉప సర్పంచ్ సోమ నాగార్జున్ రెడ్డి,కూలీలు తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** ఇందిరమ్మ గృహాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో సురేష్ అన్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ నూతన గృహ నిర్మాణ పనుల్లో భాగంగా నిర్వహించిన దర్వాజా పూజ కార్యక్రమం అంబటి పద్మ శంకరయ్య నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,ఆకోజు అశోక్ చారి హాజరై, లబ్ధిదారుల సమక్షంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకూ ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతుందని, పారదర్శక పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని తెలిపారు. నూతనంగా మంజూరైన గృహాలను లబ్ధిదారులు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్నారు.ప్రభుత్వం ఇప్పటికే ప్రతి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించిన సంగతి తెలిసిందే.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సాద సామి,స్థానిక నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

